# తరతరానికీ తేడా

శ్రీ బలివాడ కాంతరావు

భార్య గతించిన తరువాత యీ పాతికేండ్లలో యిలాంటి విషయాలు యెన్ని వినలేదు—యెన్ని పేపర్లలో చదవలేదు!

చీకటి పడింది. వాకిట కుర్చీమీద ఒంటిగా కూర్చుని ఆలోచనలో మునిగిన సీతాపతి గదిలోనికి వచ్చి లైటు వెలిగించాడు. ఒకడు భార్యను పొడిచి చంపాడు. ఇంకొకడు భార్యతో సంబంధంవున్న పరపురుషుణ్ణి ముక్కలు చెక్కలు చేసి ట్రంకు పెట్టిలో వేసి రైలెక్కించాడు—ఇలా మానవత్వాన్ని మరచి సంచరించినవాళ్ల గురించి యెన్నిసార్లో విన్నాడు.

ఈవేళ సాయంత్రం పేపర్లో యిలాంటి భోగట్టా చదివినదగ్గరనుంచీ ఒకదగ్గర కూర్చున్నా మనసు అడ్డూ ఆపూ లేకండా ఆలోచిస్తోంది. గదిలోనికి వచ్చాక ఒకదగ్గర కూర్చోడానికి మనసుపుట్టక యిటూ అటూ తిరుగుతున్నాడు. మనసు చలించి బాధతో దిగులులో వుక్కిరిబిక్కిరౌతున్నాడు.

ఇన్నాళ్ళూవుండిన సహనం యీనాటితో సరా? తను శ్రీనివాసరావుతో చెప్పాలనుకున్నది యెందుకు చెప్పకూడదు? చాలాసేపు తర్జనభర్జనలు చేసుకున్నాడు. వెలుగుతున్న విద్యుద్దీపం తన ఆలోచనలకు అంతరాయం కలిగిస్తోంది. బయటకువచ్చాడు. చీకటి—చీకటిలో ఒక గంటలో గత ముప్ఫైయేళ్ళ జీవితం నెమరు వేసుకున్నాడు. ఏడ్చాడు—నవ్వాడు. ఉద్రేకంతో తనలో తను యేవో అనుకున్నాడు—ఆ ముప్ఫైయేళ్ళ వెనుకనే ఆమె కాపరానికి వచ్చింది. తను అప్పటికే ఆఫీసరై కూర్చున్నాడు. పెద్దయింటి పిల్ల. అందచందాలతో మిసమిస యౌవ్వనానికి నులిసిగ్గు దొంతరలు చేర్చి మెరసిపోయింది. తను ఆమె దగ్గర దాచింది యేమీ లేదు. ఒక దేవతలా ఆమెను ఆరాధించాడు. ఆమె పరపురుషునివేపు కన్నెత్తి చూసిందంటేనే తను యేమో అయిపోతాడు. అలా తలచుకోవటమే తనకు గిట్టనిపని.

ఒకసారి ఆమెకు జబ్బుచేసింది. వచ్చిన యేడాదిలోనే. ఏ నౌఖరు ఆమెకు సేవచేసినా తనకు యిష్టం లేదు. ఆమె నోటిలో తనే మందుపొయ్యాలి. రాత్రి పగలూ తనే ఆమెకు కాపలా కాయాలి! ఆమె తేరుకునేసరికి తనకు చాలా నీరసం చేసింది. చేస్తుందని తనకు తెలుసు. భార్య ఆరోగ్యం చూసి తను వేగంగా కోలుకున్నాడు. ఒక ఆదర్శమైన జంట అని గర్వించేవాడు. అలాంటి వాళ్లకి తల్చుకోడానికి సంఘటనలు కరువా?

ఆమె తన పాదాలను నెత్తిన పెట్టుకున్నట్లుండేది. ఆమెకు సంసార స్త్రీకి వుండవలసిన హంగులన్నీ వున్నాయని యెల్లప్పుడూ ఆమె చల్లని మాటలు, దరహాసం, పెద్దయింటి పిల్లయినా నిరాడంబరంగా జీవించటం తెలుచుకుంటూ నా భార్య అని గర్వించేవాడు.

అదంతా నటన. ఆమె పంచదార కప్పులో వున్న విషం. అందమైన స్త్రీరూపంలో వున్న రాక్షసి! బంగారపు ఒరలోని బాకు! ఇంకా యెన్నో విధాల అనుకున్నాడు. బాధపడ్డాడు—ఆమె చనిపోయాక!

కోర్టునుంచి శ్రీనివాసరావు వచ్చాడు. బట్టలు మార్చి అలవాటుకొద్దీ తండ్రిదగ్గర కూర్చున్నాడు. తన భక్తి గౌరవం యీవేళ అందుకొనే పరిస్థితిలో సీతాపతి లేడు. ప్రతినిమిషం తనలో యేదో ఆవేశం చొచ్చుకొని హెచ్చవుతోంది. ఈ పాతికేళ్లూ తన ఓపిక మంత్రాలకు పుట్టలో అణగి మణగి వున్న నల్లత్రాచు యీనాడు ఓపిక తనలో మాయమవగానే బుస్సంటూ బైటకు వచ్చింది. కొడుకు తండ్రి పరిస్థితి అర్థంచేసుకోకండా మామూలుగా ఆరోజు కోర్టు వ్యవహారాలు చెప్పుకుపోతున్నాడు. ఇంతసేపూ ముఖం కిటికీవేపునే వుంది. అనంతాకాశంలో నక్షత్రాలు మిణుకు మిణుకు మంటున్నాయి. వాటిదగ్గరగా చేరి చూస్తున్నట్లు—తనే వాటిలా మండుతున్న బింబం అయిపోతున్నట్లు భ్రమపడుతున్నాడు!

తండ్రి భోజనం చెయ్యలేదు. ఏదో సాకు చెప్పి తప్పించుకున్నాడు. కొడుకు తండ్రి అనుమతి తీసుకొని భోజనంచేశాడు. కొడుకు భోజనం అయ్యాక ప్రక్కనున్న ఆఫీసుగదిలోకి వెళ్లాడు. తొమ్మిది దాటింది. బయట ప్రశాంతంగా వుంది. సీతాపతి దీపం ఆర్పి మళ్ళీ మంచంమీద పడుకున్నాడు. ప్రక్కగదిలోని దీపం వెలుగు మధ్యనున్న పల్చని డోర్ కర్టెన్‌ద్వారా యీ గదిలోకి కొద్దిగా వస్తోంది. చిరుగాలికి కర్టెన్ యిటూ అటూ కదులుతుంటే సీతాపతి మనసు సంశయంతో కొట్లాడుతోంది. కొడుకు మరుసటిరోజు వాదించవలసిన కేసుగురించి విషయ సేకరణలో నిమగ్నుడై వున్నాడు!

పదిగంటలయింది. ఆలోచించిన విషయాలే మళ్లీమళ్లీ మనసులో తిరిగి మధిస్తున్నయ్. కొడుకు— తనకొడుకా వీడు? నవ్వుకున్నాడు. ఆనాడే వీడిని విడిచి యే హిమాలయాలకోపోతే యెంత బావుండేది! ఈ తలపుని మళ్లీ ఛేదించాడు. తను యింతకాలం యెందుకు బ్రతికాడు? ముప్ఫైయేళ్ళలో భార్య గతిస్తే యెందరు తనకు పిల్లనిస్తామని రాలేదు. తను అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి—ఆసాధనను చూస్తూ చూస్తూ సంతోషంగా హాయిగా చచ్చిపోవాలి! తనలా తలచే సంస్కారం గల భర్తలు యీలోకంలో వుంటారా అనుకున్నాడు.

పదకొండుగంటలయింది. ఇంకా కొడుకు నిద్దరపోలేదు — "తల్లిపోయేసరికి రెండేళ్లవాడు. వీడిని చూచి యెంత గర్వించేది. వీడినిచూస్తూ నన్నే మరచిపోయేది. వీడు నాకొడుకా? కాడు, కాలేడు! కన్నవారింటికి తరచు యెందుకు వెళ్లేదని ఒక్కనాడైనా ఆరోజుల్లో పొరపాటునైనా ఆలోచించలేకపోయానే! ఆ పెద్దఅవి భక్తకుటుంబంలో — మేనమామకొడుకు చేరి...అందగాడని మొదట ప్రేమించింది — సుఖపడింది..." ఈ విషయం ఆమె బ్రతికుండగా తనకు తెలియనందుకు నొచ్చుకున్నాడు! ఆమె గతించిన నెలరోజులకే తనకు తెలిసింది!

కొడుకు ఐదేళ్లవాడు. తండ్రికి జబ్బుచేసింది. తను చెప్పాలనుకున్నది చెప్తామని ఉబలాట పడ్డాడు. అప్పుడు చెప్పి ప్రయోజనంలేదని తనకు తెలుసు. తను అనుకున్నట్లు జరగాలంటే శ్రీని యెంతో జ్ఞానం సంపాదించాలి. ఆ తెలివితేటలు, ఉత్తముడయ్యే చిహ్నాలున్నాయికానీ వయసులేదు.

పట్టుదలతో సీతాపతి జబ్బును పారద్రోలాడు డబ్బు ఖర్చుపెట్టి పెద్దపెద్ద ప్రయివేటుమాష్టర్లను పెట్టాడు. దగ్గరవుండి ప్రతి చిన్నవిషయంలోనూ కలుగజేసుకొని పిల్లవాని సత్ప్రవర్తనకు దోహదమిచ్చాడు. పదేళ్లకుర్రాడి యెదరగా తండ్రి తెలివితేటలు పనికిరావనిపించేవి. సంస్కృతం చెప్పించి ప్రాచీన కవుల గ్రంథాలు చదివించి అర్థం చెప్పించుకున్నాడు. భారత భాగవతాలు ముఖ్యంగా శాంతిపర్వం పదిసార్లైనా కొడుకుచేత చదివించి విని ఆనందించాడు.

తను యెలాంటివాడు కావాలని అనుకున్నాడో అలానే తయారయ్యాడు. మణిపూస. న్యాయశాస్త్రమే కాదు—ఏవిషయం యెత్తినా యెంతో కొంత వున్నానంటాడు. వీడినిచూసి చాలాసార్లు మురిసిపోయేవాడు. కొడుకని కాదు—తన లక్ష్యాన్ని వీడిద్వారా సాధించగలుగుతానని. గత యేడాదిలో యెన్నోసార్లు ఆవిషయం చెప్తామని వురకలు వేశాడు. జ్ఞానమైతే వుందికానీ యింకా వయసులేదని ఆగాడు!

ఇప్పుడు శ్రీనివాసరావు యిరవైయేళ్ళవాడు. ఈమధ్య సీతాపతికి తెలిసింది చెడు సహవాసం చేస్తున్నాడని. మారిపోతాడేమో, తను అనుకున్నట్లు సహాయకారి కాడేమోనని బాధ పడ్డాడు. వాళ్ళతో తిరగవద్దని ఆతురతతో చెప్పాడు. శ్రీనివాసపురావు మెల్లగా "ఏదైనా నలుగురూ చెడ్డ అంటే అదెందుకు చెడుగయ్యిందో దానిలో వ్రేలుపెట్టి మరీ కనుక్కోమంటారా లేక నన్నూ నలుగురిలా దానివేపు చూడకండా చెడ్డ అనమంటారా? వాళ్లదగ్గరికి చేరినంత మాత్రాన నేను కొవ్వునుకాదు కరగిపోడానికి. నాలో వట్టి రక్తమాంసాలే లేవు— ఎముకలుకూడా వున్నా" యన్నాడు.

ఈ జవాబు విన్నాక తండ్రి మాటాడలేదు. దానిగురించి రెండు మూడు రోజులు ఆలోచించాడు. ఎంత తన కొడుకు కాడని అనుకోవాలని ప్రయత్నించినా వాడంటే యేదో తనకు అభిమానం తనలో చుట్టుచుట్టలుకుంటోంది. ఇది అసలైన అభిమానం కాదని, పెంపకపు మమకారమని అనుకొనేవాడు. వాడి రూపు, నలుగురిలో తలెత్తి తిరిగి, ప్రతి విషయంలో, వాదనలో ముందంజవేసే ఆ ప్రజ్ఞను చూసి నా కొడుకెందుకు కాకూడదని చాలాసేపు గింజుకొనేవాడు. కానీ ఆమె కొడుకు వాడు. ఆమె అంటే వాడి కెంత ప్రేమ, భక్తి! ఆమెగురించి యెన్నెన్ని ప్రశ్నలు వేసేవాడు! చిన్నప్పటినించీ

తల్లి అంటే అంతఆసక్తి చూపించే పిల్లలని తనెప్పుడూ చూడలేదు. ఇలాంటివాడికి తల్లిసంగతి తెలిస్తే?

టంగ్ టంగ్ మని పండ్రెండు గంటలు పడ్డాయి. ఇంతవరకూ—తల్చుకున్నది మళ్ళీ తల్చుకున్నాడు. మళ్లీ మళ్లీ అదే. ఆలోచనమీద ఆలోచన—మళ్ళీ అడుగుఆలోచన మీదికి రావటంతో ఆలోచన దొంతర కూలిపోయేది. ఒక ఆలోచనమీద మళ్లీ యింకో ఆలోచన స్వారీ—ఇలా నిర్విరామమైన ఆలోచనతో మెదడు మంథుకపోయింది. నరాలు తోడుకపోతున్నయ్. బాధ—కడుపులో పుండు—గొంతుకలో హాలాహలం వున్నట్లుంది. మింగ శక్తి లేదు—ఓర్చటానికి వీలే లేదు. తన్ను తాను మరచిపోయాడు. తల బరువెక్కిపోయింది. గుండెమీద కొండంత బరువుకు మించి లేవలేకపోయాడు.

ఆమె యిప్పుడే చనిపోయినట్లనిపించిం దతనికి; ఇప్పుడే అసలు విషయం తెలిసింది. ఈ నిమిషంలో కత్తులూ, ఖూనీకోర్లూ, బాధపడ్డ భర్తలు, రక్తం, మాంసంకండలు—అంతా యెదరగావున్నట్లు భ్రమపడసాగాడు! రాబందులకు మాంసంముక్కలు యెగరవేస్తున్నాడు-ఊహలో—ఈ ఆలోచనల పూబీతో—మళ్ళీ తనలో యౌవ్వనం వుబికింది. ఆనాటి పౌరుషం సంప్రాప్తించింది.

లేచాడు. డోర్ కర్టెన్ దాటివెళ్ళినా గుమ్మం గట్టిగా పట్టుకున్నాడు.

"ఏం నాన్నా?" కొడుకు మెల్లగా ప్రశ్నించాడు.

"నేనా? కాను కాను..." అనితిరిగిపోయాడు.

కొడుకు గదిలోకి వచ్చి దీపం వెలిగించేసరికి తండ్రి కిటికీగజాలు పట్టుకొని గజగజ వణికిపోతున్నాడు.

"ఏమన్నారూ?"

ఎరుపుదేరినకళ్లు ఒక్కసారి అతనవేపుతిరిగాయి. శ్రీని యీ మార్పుకు ఆశ్చర్యంపొందినా గాబరా పడలేదు. "పడుకోండి" అన్నాడు.

తన్ను తాను మరచిన సీతాపతి ఒక్క అరుపు అరిచాడు—"నీ తల్లి ..." తరవాత తనకోపం మంటగా రానీయలేదు. ప్రయత్నించి మరుక్షణంలో "శ్రీనీ—నీతల్లి నన్ను ద్రోహంచేసిందోయ్. తెలుసుకోలేక అది చచ్చిపోయినప్పుడు నెత్తిబాదుకుని యేడ్చాను. ఆత్మహత్య చేసుకోవాలని వురికానోయ్!"

సీతాపతి యీ మాటలు అంటూ నెత్తి బాదుకున్నాడు. కళ్ళలో నీరు తిరిగేవున్నాయ్.

కొడుకు మాటాడలేదు. తండ్రి అంతతో ఆగలేదు. "అది చనిపోయాక తెలిసింది. అప్పుడేం చేస్తాను? ఎవరికీ యీ విషయం తెలియపర్చకుండా నాలో నేను కుమిలిపోతున్నాను."

కళ్లు తుడుచుకుంటున్నా నీరు కారుతూనే వుంది. కొడుకు యిప్పుడు ప్రశ్న వెయ్యకుండా వుండలేకపోయాడు—"పాతికేళ్ళ తరవాత నాకు చెప్పటంలో మీ ఉద్దేశం?"

ఈ సూటిప్రశ్న అతనిలో దిగజారుతున్న ఆవేశాన్ని బయటకు తెచ్చింది! అన్నాడు—

ఆరోజునించీ ప్రతి నిమిషం నా ప్రతికణం నించీ ఆమెను నేను అసహ్యించుకుంటున్నాను. నువ్వంటే సర్వస్వం దానికి—నిన్నుచూసి యెంత గర్వించేది—నీకోసమే నే నింకో పెళ్ళి చేసుకోలేదు. నీకోసమే నేను బ్రతికున్నాను. నిన్ను యింతవాడుగా చేశాను. ఎందుకంటావ్? అవినీతిని దగ్గిరకు చేరనీయనివాడవు. నాకంటే హెచ్చుగా నువ్వు దాన్ని అసహ్యించుకుంటావు. అదిచూచి నేను ఆనందిద్దామని—నువ్వు నీ పిల్లలతో చెప్తావు. వాళ్లు వాళ్ల పిల్లలతో చెప్తారు. ఇలా ఆమె తరతరాలా అసహ్యించకో బడుతూ ఆ నరకకూపంనించి బయటపడదు!"

శ్రీనివాసరావు మాటాడలేదు. ఆయన ముఖంలో యెటువంటి మార్పూ చూడని తండ్రి మళ్ళీ దైన్యంగా చెప్పుకుపోతున్నాడు—

"ఈ లోకంలో ఏ కొడుకూ అవినీతిగల ఏ తల్లినీ మన్నించలేడు నాయనా? ఇంత జ్ఞానవంతుడివి నువ్వు మన్నించగలవా? లేవు—లేవు—ఏదీ శ్రీనీ-మాటాడవేంరా? ఏదీ ఒక్కసారి నీ తల్లిమీద అసహ్యాన్ని గట్టిగా ఆ నరకంలో దానికి వినిపించేటట్లు అరిచేయ్ నాయనా—గట్టిగా...గట్టిగా..."

సీతాపతి శరీరమంతా వణకనారంభించింది. తనలో యీకొద్దినిమిషాల్లో వచ్చిన ఉద్రేకం కొడుకు మౌనంతో మెల్లమెల్లగా తగ్గిపోతోంది. మళ్లీ తను ముసలివాడై పోతున్నాడు.

కొడుకు కొద్దినిమిషాలమౌనం తరవాత సూటిగా "మీరు మాఅమ్మ అవినీతిని కళ్లారాచూడలేదని మీ మాటల వల్లనే నిరూపణ అవుతోంది. మీరు పరులు చెప్పిన మాటలమీద ఆధారపడి యిన్నాళ్లూ జీవితం వృధాగా పాడుచేసుకున్నా రన్నమాట!"

"వృధా!" మళ్లీ మళ్లీ రెట్టించి "నేననుకున్నాను. శ్రీని యెంతో విజ్ఞానవంతుడు, నాబాధ అర్థంచేసుకో గలడని. అందుకోసమే యింతకాలం యీబాధభ్రమిం గేస్తూ బ్రతికాను. ఇప్పుడు నాబాధ అర్థంచేసుకునే జ్ఞానం, వయసు నీకుంది. బాగాఅర్థంచేసుకో శ్రీనీ!"

"అసలైనబాధను నేనెప్పుడైనా పంచుకోడానికి సిద్ధంగానే వున్నాను. కాని నాకు యేదో నిదర్శనం చూపించకుండా గ్రుడ్డిగా యేవిషయాన్నిమాత్రం నమ్మమని మీరుమాత్రం యెలా బలవంతం చెయ్య గలరు?"

"గుడ్డి, గుడ్డి! మనుషులు మారిపోతున్నారు. వీళ్లలో నీతీ నిజాయితీ కరువైపోతోంది. నేను యేఆశతో నిన్ను పురాణాలు చదివించి విజ్ఞానవంతుడ్ని చేయించా ననుకున్నానో..."

దుఃఖంతో సీతాపతినోట మరి మాటరాలేదు. పరుపుమీదపడి వెక్కి వెక్కి యేడవాలనిపించింది. వారబడి ముఖం రెండోవేపు త్రిప్పేశాడు. కన్నీరు తల గడను తడుపుతోంది.

కొడుకు దగ్గరగావచ్చి "మీగురించి చెప్పవలసిన వాళ్ళు మీరుకాదు—మేము. మాగురించి చెప్పవలసిన వాళ్లింకా పుట్టలేదు. గ్రుడ్డిగానమ్మమని యేపురాణాలూ చెప్పలేదు. వికసించిన మానవునిసృష్టి అవి. అవి మాన వునిబుద్ధి యింకా వికసింప జేసుకోడానికి సహాయ కారులు—మీరు మాఅమ్మ విషయంలో ఒకన్యాయ మూర్తిగా యేక్షణంలోనూ కాలేదా?"

సీతాపతి యీసారియేడుస్తూ కొడుకును పొమ్మని అరిచాడు. కొద్దిక్షణాలు మాటాడనికొడుకు నెమ్మదిగా "మీరు నన్ను పెంచారు. అసలైనవిద్య నభ్యసింప జేశారు, మీలోపండిన జ్ఞానాన్ని నాలోచొప్పించారు. మీరంటే నాకోవిధమైన భక్తిని నాలోకలగజేశారు. కాని మీరు మీస్వవిషయంలో ఆ జ్ఞానమార్గాన్ని విడిచిపెట్టారు"

"లేదు, లేదూ! నువ్వే చెడుగును సమర్థిస్తున్నావ్! ఏదేశంలోనూ నాలా ఓర్పునుచూపించి యిలా తలచే వాడుండడు—నీలా యెవడూ అవినీతిని సమర్థించడు"

కొడుకు తండ్రి ఉద్రేకం కొద్దిగా శాంతించే వరకూ ఆగి, అన్నాడు "మీరు బాధపడ్డది కాకుండా నన్ను బాధపెట్టాలనే స్వార్థం మీలో పాతుకపోయింది కాబట్టి యిలాఅన్నారు. నాకు మనుష్యు లంటే యెంతోనమ్మకం. ఒకడు దొంగఅయితే వాడిని దొంగను చేసినవాళ్లలో నేనొకడ్ని. ఒకామె పడుపు వృత్తిలో దిగిందంటే దానికిబాధ్యుల్లో నేనొకణ్ణి—ఆమెలో నాతల్లినిచూస్తాను—ఆమెలో ఆదిశక్తిని చూస్తాను. ఆమెను పూజించగలను నాన్నా!"

సీతాపతి కొడుకువేపు తలత్రిప్పలేకపోయాడు. శ్రీని మాటలు ఆపలేదు.

"జ్ఞాపకం తెచ్చుకోండి. ఒకసారి యేంచెప్పారో? మీతండ్రి భార్యవుండగా యిద్దరు వుంపుడు కత్తెలను వుంచాడని. ఒక వుంపుడుకత్తె యౌవ్వనం అనుభవించాక యెందుకూపనికిరానిది కాగానే వీధిలో పిల్లలతో అడుక్కునేటట్లు చేశాడని. ఆయనమీద మీరేమీచర్య తీసుకోలేదేం నాన్నా?"

శ్రీని కాస్సేపు ఆగాడు. మాటలాడలేని తండ్రి హృదయానికి హత్తేటట్లు సహజసౌజన్యస్వరంతో: "మాఅమ్మతప్పు మీరు కళ్లారాచూడలేరు. ఆడది యింటి పిల్లికాకుండా నలుగుర్లో కలసిమెలసితిరిగి మంచీచెడ్డా అర్థంచేసుకోనే సంస్కారంవుంటే ఆమెపై అప్పుడే యెన్నికట్టుకథలైనా లేస్తాయ్. ఎవరోచెప్పింది నమ్మి యింత యౌవ్వనాన్ని కాల్చుకున్నారు. ఇంతకాలం ఒకర్ని అసహ్యించుకోడానికే బ్రతికారు—అస హ్యించుకున్నారు అంతే! పోనీ మా అమ్మతప్పుచేసిం దనే నిర్ధారణ అయిందనుకున్నా మంటల్లోమండి పవిత్రురాలైన అర్థాంగిమీద యిన్నియేళ్లుగడచినా ఆ మాత్రంప్రేమ చూపించలేకపోయారు. ఈమాత్రంచేయ లేనివారు మీరామెనంతగా ప్రేమించానంటే యెలా నమ్మను నాన్నా! ఎదుటివాళ్లను ప్రేమించడానికి, వాళ్లప్రేమ అందుకోడానికి అర్హతగలప్రేమ మీలో లేదని నిరూపణ అయింది. మనిషైపుట్టి మీబ్రతుకును యెంత నిరర్థకం చేసుకున్నారో చూడండి. మాఅమ్మ గురించి మీరింతచెప్పాక ఆమెమీద నాకుండే ప్రేమా భక్తీ కొల్లలుగాహెచ్చి పోయినాయి—ఎంచేతంటే నా పవిత్రమైన కన్నతల్లిని యీపాతికేళ్లూప్రతి నిమిషం ఒకడు అసహ్యించుకోడానికే బ్రతికాడని!"

మాటరాని తండ్రివేపుచూస్తూ ప్రక్కగదిలోకి వెళ్లిపోతూ ఆగి "స్వార్థంతో యెదటివారి కష్టనిష్ఠు రాలను అర్థంచేసుకోని వాడు అథవా అర్థంచేసుకో డానికి ప్రయత్నించనివాడు వీధిలో కుక్కలా చని పోతాడని అంటారు--"

ఈమాటలు సీతాపతి యెముకల్ని దూదిలాఏకు తున్నయ్. తెల్లవారేసరికి మంచంమీదలేడు. బహుశః వీధిలో కుక్కలా చనిపోడానికి పోయాడేమో?